జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం



తిరుపతి: కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత



రామచంద్రాపురంలో కంటి అద్దాల పంపిణీ

- కమిషనర్ హరిత

తిరుపతి తుడా: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అన్నారు. స్థానిక తాతయ్యగుంటలోని అర్బన్ హెల్త్ సెంటర్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేదలందరికీ స్థానికంగానే నాణ్యమైన వైద్యాన్ని అందించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. బీపీ, షుగర్తో పాటు మరో ఏడు రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షలు చేసుకున్న వారికి కేస్ షీట్లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర రెడ్డి, కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, తేజస్విని పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

చంద్రగిరి: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ రమేష్ బాబు అన్నారు. పనపాకం పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమం విజయవంతానికి స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. జూపార్క్ డైరెక్టర్ మణి యాదవ్, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, పానేటి చెంగల్రాయులు, సీహెచ్ రెడ్డప్ప, అమాస నాగేశ్వరరావు, నాగభూషణం పాల్గొన్నారు.

ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆకుకూరలను క్రమం తప్పకుండా ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ తెలిపారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ సుహాసిని గ్రామ సచివాలయంలో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో న్యూట్రీషన్ స్టాల్స్ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కోడిగుడ్లు, చిరుధాన్యాలు, పాలు, పాల పదార్థాలు తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్య జీవనం సాధ్యమని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందజేశారు.

పాకాల: మండల కేంద్రంలో జరిగిన సురక్ష కార్యక్రమంలో వైద్యులు స్థానికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంఈఓ బాబ్జీ, సర్పంచ్ కస్తూరి, డాక్టర్లు మురళీకృష్ణ, భవాని పాల్గొన్నారు.

రామచంద్రాపురం: ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సీరామాపురం గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను గుర్తించి చికిత్స తీసుకోవచ్చని చెప్పారు. గ్రామస్తులకు కంటి పరీక్షలు చేసి అద్దాలను పంపిణీ చేశారు.



చంద్రగిరి: ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



పాకాలలో వైద్య పరీక్షలు

క్లుప్తంగా

ఉపాధిహామీ పనుల తనిఖీ



పనులను తనిఖీ చేస్తున్న పీఈ మహేశ్వర్రెడ్డి

పాకాల: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మహేశ్వర్రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. కూలీల సంఖ్య పెంచాలని, చెరువుల్లో పూడికతీత, పంట కాలువలు శుభ్రపరిచే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఇరంగారిపల్లి, నేంద్రగుంట పంచాయతీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ కళ్యాణి, టీఏలు బాలకృష్ణ, గీత, జేఈ ఈశ్వర్ ఉన్నారు.

కల్తీ ఆహార పదార్థాల నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో కల్తీ ఆహార పదార్థాల నిర్ధారణపై పరీక్షలు నిర్వహించారు. వంట నూనె, మైదా, గోధుమ, నెయ్యి, కూరగాయలు, టీ పొడర్, కాఫీ వంటి పలు రకాలైన ఆహార పదార్థాలు ఏ విధంగా కల్తీ అవుతున్నాయో ప్రయోగశాలలో పలు రకాల పరీక్షలు నిర్వహించారు. అధ్యాపకులు జయమాధురి, సువర్ణలతా దేవి, చండీ కుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సజ్జలకు బిషప్ కౌన్సిల్ కృతజ్ఞతలు



సజ్జలకు కృతజ్ఞతలు చెబుతున్న మైనారిటీలు

తిరుపతి కల్చరల్: చర్చి ఫాదర్లకు గౌరవ వేతనం జమ చేయడంపై ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ప్రవీణ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం గుంటూరులో ఆయన నివాసంలో కలిశారు. అర్హులైన పాస్టర్లలందరికీ గౌరవ వేతనం అందించాలని కోరారు. అలాగే గత ప్రభుత్వం దళిత క్రైస్తవులకు వ్యతిరేకంగా ఇచ్చిన 98 జీఓను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని సజ్జల తెలిపారు. మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మెరుగు నాగార్జున, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ఉన్నారు.

వేగవంతంగా రహదారుల అభివృద్ధి

–డిప్యూటీ మేయర్ భూమన అభినయ్రెడ్డి



మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: నగరంలో రహదారుల అభివృద్ధిని ఉద్యమ తరహాలో చేపట్టినట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. కాటన్ మిల్లు రైల్వే గేటు–హీరో హోండా షోరూం ఎదురు రైల్వే గేట్లను కలుపుతూ రైల్వే ట్రాక్కి ఉత్తరం వైపున నిర్మిస్తున్న 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. దశాబ్దాలుగా తిరుపతిలో సరైన రోడ్ల వ్యవస్థ లేకపోవడం వల్ల నగరం విస్తరణకు నోచుకోలేదన్నారు. మరో 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారుల అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 12 మాస్టర్ ప్లాన్ రోడ్లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రహదారులు అందుబాటులోకి రావడంతో మరో 5 వేల ఎకరాల్లో అభివృద్ధి పరుగులు పెట్టనుందని తెలిపారు. డిసెంబర్ నాటికి నగరంలోని దాదాపు అన్ని రోడ్లను అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు.

రికార్డుల పరిశీలన

పాకాల: మండలంలోని కె.వడ్డేపల్లి ఆర్బీకేను మంగళవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్బీకే సమీపంలోని పట్టు పురుగుల షెడ్లను సందర్శించారు. అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఓ పుష్పావతి, ఏఈఓ రమేష్నాయక్ ఉన్నారు.

కాలువ నిర్మాణానికి భూమిపూజ

చంద్రగిరి: స్థానిక బ్రాహ్మణవీధిలో తుడా నిధులు రూ.10 లక్షలతో కాలువ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి పనులను ప్రారంభించారు.

శ్రీమాన్ పార్థసారథి భట్టాచార్యుల జయంతి

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీమాన్ రొంపిచర్ల పార్థసారథి భట్టాచార్యులు 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ..హిందూ ధర్మ పరిరక్షణలో హిందూ దేవాలయ చట్టరూప కల్పనలో ఆయన చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ప్రముఖ వైఖానస పండితులు వేదాంతం వేణుగోపాల కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. పార్థసారథి భట్టాచార్యులు టీటీడీ, వైదిక సంస్కృతి పరిరక్షణ, వైఖానస వాఙ్మయం కోసం చేసిన కృషి ఎనలేనిదన్నారు. అనంతరం వైఖానస ఆగమ విభాగం అధ్యాపకుడు పరాశరం భావనారాయణాచార్యులు రచించిన శ్రీవైఖానస కథామథనం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రూప

చంద్రగిరి: గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ.7 కోట్లకు పైగా నిధులతో చంద్రగిరి పంచాయతీలో అభివృద్ధి పనులను చేపట్టినట్లు సర్పంచ్ ముదికుప్పం రూప తెలిపారు. మంగళవారం చంద్రగిరి పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గ్రామ సభను నిర్వహించారు. గ్రామస్వరాజ్యం స్థాపన కోసం గాంధీజీ కలలను సీఎం వైఎస్ జగన్ నెరవేరుస్తున్నారని తెలిపారు. ఇప్పటికే రూ.7కోట్ల తుడా నిధులతో సమావేశ మందిరాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, ఆర్ఓ ప్లాంట్లు, రచ్చబండ, బెంచీలను ఏర్పాటు చేశామని.. మరో రూ.1.47 కోట్లతో జలజీవన్ మిషన్ పథకం కింద వాటర్ ట్యాంకులు, సంపులు, బోర్లు, పైపు లైన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రూ.15 లక్షల పంచాయతీ నిధులతో టవర్పోల్స్, సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీ అభివృద్ధి కోసం ఎంపీపీ నిధుల నుంచి రూ.30 లక్షలు అందించనున్నట్లు ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి ప్రకటించారు.

తిరుపతి మంగళం: మంగళం సప్తగిరినగర్ పంచాయతీలోని సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. సుమారు రూ.10కోట్లతో పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్రెడ్డి చొరవ చూపారని ఉప సర్పంచ్ అశోక్రెడ్డి తెలిపారు. సర్పంచ్ నాగభూషణమ్మ, మహ్మద్కాసీమ్బాషా పాల్గొన్నారు.

భాకరాపేట: ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్రెడ్డి మాట్లాడారు.

15 నుంచి కపిలతీర్థంలో దసరా ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీకామాక్షి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. శ్రీకామాక్షి అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 11వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. 15న కలశస్థాపన, అంకురార్పణ చేయనున్నారు. 16వ తేదీ శ్రీకామాక్షి దేవి, 17న శ్రీఆదిపరాశక్తి, 18న మహాలక్ష్మి, 19న శ్రీఅన్నపూర్ణాదేవి, 20న దుర్గాదేవి, 21న శ్రీమహిషాసురమర్ధిని, 22న శ్రీ సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. 23న విజయదశమి సందర్భంగా శివపార్వతుల అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన, దేవీ భాగవతంపై ప్రవచనం, లలిత సహస్ర నామ పారాయణం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సకాలంలో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

–స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేస్తామని తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ హరిత అన్నారు. దేశ వ్యాప్తంగా స్మార్ట్ సిటీస్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్మార్ట్ సిటీస్ మిషన్ డైరెక్టర్ క్రునాల్ కుమార్ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్కు తిరుపతి నుంచి ఆమె పాల్గొన్నారు. క్రునాల్ కుమార్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా స్మార్ట్ సిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. పెండింగ్ ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం హరిత తిరుపతిలో జరుగుతున్న, పూర్తి చేసిన ప్రాజెక్టుల వివరాలు తెలిపారు.

ఈ- పంట నమోదుతో రైతులకు ఎంతో మేలు

రామచంద్రాపురం: ప్రతి రైతు తమ పంటను ఈ–క్రాప్లో నమోదు చేసుకోవడం ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి, కుప్పంబాదూరు, నడవలూరు రైతుభరోసా కేంద్రాల పరిధిలో జరిగిన ఈ–క్రాప్ నమోదుపై క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. పంట సాగు చేసే ప్రతి రైతు ప్రభుత్వం అందించే వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీ ఇతర వ్యవసాయ రాయితీలు పొందాలంటే ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి స్రవంతి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు





అగరాల వద్ద ప్రమాదానికి గురైన తుఫాన్ వాహనం, కోట సమీపంలో కారు

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పుణె నుంచి తిరుమల వస్తున్న తుఫాన్ వాహనం అగరాల సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. వాహనంలోని లక్ష్మణ్, కవిత, మీనకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాన్ని తొలగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్లే దారిలోని కోట వద్ద సర్వీసు రోడ్డుపై ఆగి ఉన్న కారును వేలూరు వెళ్తున్న ఇన్నోవా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇరు వాహనాల యజమానులు కేసు లేకుండా రాజీ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితులకు జైలు

తిరుపతి లీగల్: తిరుపతి భవానినగర్లోని ఓ ఇంట్లో కెమెరా, ద్విచక్రవాహనాన్ని అపహరించిన కేసులో దామినేడు ఇందిరమ్మ ఇండ్లకు చెందిన పి.సీతాపతికి మూడు నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. ఇంటి యజమాని అబ్దుల్ అజీజ్ ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

జేబు దొంగలకు రెండు నెలలు

తిరుమల శ్రీవారి ఆలయం క్యూలైన్లో ఖమ్మం జిల్లాకు చెందిన ఓ భక్తుడి జేబులోని రూ. 40 వేలు అపహరించిన కేసులో విజయనగరం జిల్లా కొండ లక్ష్మీపురానికి చెందిన జి.రమేష్, విజయవాడ బెంజ్ సర్కిల్కు చెందిన ఎల్.శ్రీనుకు రెండు నెలల జైలు, రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మద్యం తాగి తిరుమలకు వెళ్లిన కేసులో..

మద్యం తాగి తిరుమల వెళ్లిన కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు వాహన డ్రైవర్పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.